క్లుప్తంగా

నిత్య కర్మాచరణే భగవత్ కృపకు సాధనం

బోట్‌క్లబ్: నిత్యకర్మలు ఆచరించడం ద్వారా భగవంతుని కృపతోపాటు గురువులు అనుగ్రహం కూడా పొందగలమని సుధాపండితులు కానుగోవి వాసుదేవాచార్ అన్నారు. స్థానిక జర్నలిస్ట్ కాలనీలో ఉన్న శ్రీరమాసహిత సత్యదేవ మందిరంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్వాచార్యులు ప్రతిపాదించిన కర్మలను నిత్యం ఆచరించడం ద్వారా కుటుంబంతో పాటు సమాజానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మధ్వసభ కమిటీ కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు యాతగిరి త్రినాథ్, యాతగిరి మధ్వేష్, రాచూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

కాకినాడ రూరల్: సమాజ సేవలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సేవలు అభినందనీయమని క్లబ్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శుక్రవారం లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. కాకినాడ విజన్ అధ్యక్షురాలు ఎంవీఎస్ఎల్ ప్రసూన, డాక్టర్ విన్సెంట్ కుమార్, ఫార్మాసిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ విప్పర్తికి సత్కారం



జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును సత్కరిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డిలను దళిత గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. జిల్లాలోని దళిత గిరిజన సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు. వారి సమస్యలపై విప్పర్తి స్పందిస్తూ తక్షణం పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐక్యవేదిక అధ్యక్షుడు డోకుబుర్ర భద్రం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు రాంబాబు, జాయింట్ సెక్రటరీ అమలదాసు నూకరాజు, బాపూజీ నగర్ సభ్యులు పలివెల వెంకటరమణ తదితరులు జెడ్పీ చైర్మన్‌ను సత్కరించారు.

విద్యార్థి దశ నుంచే దాతృత్వం అవసరం



పాఠశాలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న నారాయణ ఈ-టెక్నో విద్యార్థులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థి దశ నుంచే దాతృత్వాన్ని పెంపొందించుకోవాలని రామారావుపేటలోని నారాయణ ఇ-టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ షర్మిల పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మహర్షి సాంబమూర్తి వికలాంగ బాలికల పాఠశాలలో ఆ పాఠశాల విద్యార్థులు బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, కూరగాయలు, పండ్లు, స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ షర్మిలకు వికలాంగ పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

కాకినాడ సిటీ: జర్నలిస్టు సంఘాలు, కాకినాడ అఖిలపక్షం, ప్రజా, కార్మిక సంఘాలు ఢిల్లీలో జర్నలిస్టుల అరెస్టుకు నిరసనగా శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద, ధర్నా చౌక్ వద్ద ధర్నా చేశాయి. న్యూస్ క్లిక్, మీడియా సంస్థలపై కేంద్ర ప్రభుత్వ దాడులను, అక్రమ అరెస్టులను ఖండించారు. ధర్నాలో ఏపీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాతాడ నవీన్ రాజు, ఎస్‌కే మున్నీ, వీధి గోపినాథ్, వల్లూరి నానాజీ, పుర్రె త్రినాథ్‌లతో పాటు అఖిల పక్షం నాయకులు జి.బేబీరాణి, దువ్వా శేషుబాబ్జీ, ఎం.రాజశేఖర్, దూసర్లపూడి రమణరాజు, నరాల శివ, చెక్కల రాజ్‌కుమార్, చంద్రమళ్ల పద్మ, తిరుమలశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

కాకినాడ రూరల్: మండలంలోని పగడాలపేటకు చెందిన మోసా శ్రీనివాస్‌ను గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఇంద్రపాలెం ఎస్సై దేవసుధ తెలిపారు. గత నెల 22న శ్రీనివాస్ కరప మండలంలో తన పొలం వద్దకు వెళ్లి వస్తుండగా అతడిని దత్తత తీసుకున్న తల్లికి మనవడి వరసయ్యే గంగిరి సింహాద్రి ఆస్తి తగాదా విషయమై పగడాలపేట వాటర్ ట్యాంకర్ వద్ద దారికాసి గాయపరిచాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి
- రేచర్లపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష



పరీక్షలు చేయించుకున్న మహిళకు మందుల కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: ప్రజలకు చేరువగా నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలన్నదే సీఎం అభిమతమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రేచర్లపేటలోని పట్టణ పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాలుగు డివిజన్లకు సంబంధించి సుమారు 25 వేల కుటుంబాలను ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది స్వయంగా కలిసి ఆరోగ్య సమస్యలపై సర్వే చేశారన్నారు. వారికి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. కంటి వైద్య పరీక్షలు కూడా నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు ఇస్తున్నట్లు చెప్పారు. పేదలు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ముఖ్యమంత్రి తీసుకువచ్చారన్నారు. వైద్య రంగంలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేశాయన్నారు. ఆరోగ్యశ్రీని పటిష్టం చేయడం, కొత్త వైద్య కళాశాల ఏర్పాటు, పోస్టుల భర్తీ, పీహెచ్‌సీల అభివృద్ధి వంటి చర్యలే ఇందుకు నిదర్శనమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలలో సురక్ష శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఇళ్లకు వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించి, ఆరోగ్య సమస్యలు ఉంటే తెలియజేయాలని, వైద్య నిపుణులు వారికి అవసరమైన పరీక్షలు చేసి చికిత్స అందిస్తారన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత, రోకళ్ల సత్యనారాయణ, శిగల మధు తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేట సచివాలయం-3లో వైద్యసేవలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణరావు



కొరిపల్లి శిబిరంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పేదలకు వరం

కరప: మండలం కొరిపల్లిలో శుక్రవారం సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి శిబిరానికి హాజరై శిబిరాన్ని పరిశీలించారు. గ్రామ సచివాలయం పరిధిలో కొరిపల్లి, జెడ్.భావారం గ్రామాల నుంచి 444 మంది శిబిరంలో తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. వైద్యసిబ్బంది వారికి పరీక్షలు చేసి, కేస్ షీట్‌లను అందజేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ పి.ఆశ, డాక్టర్ ఈ.సింధూర తదితరులు రోగులను పరీక్షించి, మందులు రాసిచ్చారు. కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వి.లక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, స్థానిక నాయకులు, అధికారులతో కలసి కేస్‌షీట్, మందుల కిట్లను రోగులకు అందజేశారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీటీసీ డి.సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, టి.గజేంద్రుడు, కె.శ్రీనివాస్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, గ్రామకార్యదర్శి పి.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కాకినాడ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ నారాయణమూర్తి పేర్కొన్నారు. రమణయ్యపేట గ్రామం సచివాలయం-3 పరిధిలో బాపన్నదొర కాలనీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా వైద్యులు స్థానికులకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఆయనతో పాటు ఎంపీడీఓ స్వప్న, ఈఓ పీఆర్డీ రామాంజనేయులు తదితరులు సందర్శించి రిజిస్ట్రేషన్ల, మందులు కౌంటర్, పోషకాహార ప్రదర్శన, అవగాహన కౌంటర్‌ను పరిశీలించారు. వైద్య సేవల కోసం పండూరు పీహెచ్‌సీ డాక్టర్ ఆయేషా ఫాతిమాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ భోజన ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, మండల ఎస్సీ సెల్ సభ్యుడు పెనుమాల ధర్మారావు, కాలనీ వైస్ ప్రెసిడెంగ్ పెనుమళ్ళు రామిరెడ్డి, రేఖారెడ్డి, లక్ష్మీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): కాకినాడ పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కామర్స్, జువాలజీ, ఆక్వా కల్చర్, కంప్యూటర్ అప్లికేషన్స్, జర్నలిజం, మైక్రో బయాలజీ, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో కనీసం 55 శాతం, ఆపైన మార్కులను కలిగి ఉండాలని, అదనపు అర్హతలు పీహెచ్‌డీ, నీట్, ఏపీ సెట్ తదితర వాటిలో బోధన అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. సాంకేతిక విధానం ద్వారా ఆన్లైన్, తరగతి గదిలో బోధన నైపుణ్యం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను, సర్టిఫికెట్లను 7వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటల లోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అభ్యర్థులు 9వ తేదీ ఉదయం 10 గంటల లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

బోట్‌క్లబ్: అన్నం పరబ్రహ్మ స్వరూపమని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయంలోని సంపత్ విజయ గణపతి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 5 వేల మంది అన్నదానం చేశారు. తొలుత ఆలయంలో డీసీ ప్రత్యేక పూజలు చేశారు. ఈవో రమణ ఆయనకు ఘనస్వాగతం పలికారు. జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, డీసీ కార్యాల సూపరింటెండెంట్ కనపర్తి నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్ తగ్గిస్తే దశలవారీ పోరాటం

కాకినాడ సిటీ: కాకినాడకే తలమానికమైన ఎన్ఎఫ్‌సిఎల్ పరిశ్రమను క్రమక్రమంగా ఎత్తివేసే కుట్ర ఆపాలని కలెక్టర్ కృతికా శుక్లాను, కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను సీపీఐ జిల్లా బృందం శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. గత వారంలో హైదరాబాదులో డైరెక్టర్స్ మీటింగ్‌లో జరిగిన విషయాలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు కలెక్టర్, ఎమ్మెల్యేలకు వివరించారు. ఎన్ఎఫ్‌సిఎల్ 1127 ఎకరాల భూమిని గ్రీన్ అమోనియా సంస్థకు 400 ఎకరాలు ప్లాంటు, 285 ఎకరాలు గ్రీన్ ప్లాంటుకు ఇవ్వడానికి ఒప్పందం జరిగిందనానరు. కేవీకేరాజు మనమడు రాహుల్ రాజ్‌కు వ్యక్తిగతంగా 585 ఎకరాలు ఇవ్వడానికి రెండు కంపెనీలు నిర్ణయించాయని మధు వివరించారు. ఈ 585 ఎకరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఉపయోగించేందుకు గజాన లెక్కన చేసి రిజిస్ట్రేషన్లకు ఏర్పాట్లు చేస్తున్నారని మధు వివరించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పరిశ్రమ నుంచి గ్రీన్ బెల్ట్ వేరు చేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎమ్మెల్యేలను కలసిన వారిలో కె.బోడకొండ, పి.సత్యనారాయణ, ఎస్.నారాయణ, టి.అన్నవరం తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కన్వర్టబుల్ స్టేడియం పనులను వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- క్షేత్రస్థాయిలో స్మార్ట్‌సిటీ సీఈఓతో కలసి ప్రగతిపై సమీక్ష



కన్వర్టబుల్ స్టేడియం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, కమిషనర్ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ రూరల్: స్థానిక సురేష్‌నగర్‌లో రూ.18 కోట్లతో నిర్మిస్తున్న కన్వర్టబుల్ స్టేడియం పనులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శుక్రవారం పరిశీలించారు. స్మార్ట్ సిటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, అధికారులతో కలసి పనుల ప్రగతిని సమీక్షించారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక వసతులతో స్మార్ట్ సిటీ నిధులతో ఈ స్టేడియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. 1200 సీట్ల సామర్థ్యంతో, బ్యాడ్మింటన్, కబడ్డీ, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ కూడా నిర్వహించేందుకు వీలుగా ఈ స్టేడియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండీ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ నవంబర్ 15 నాటికి అన్ని పనులూ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సుమారు 65% పైగా పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యేకు వివరించారు.

అధికారులతో సమీక్ష

కాకినాడ: స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో వివిధ దశలలో ఉన్న పనుల ప్రగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. కన్వర్టబుల్ స్టేడియం, స్కేటింగ్ రింక్, సైన్స్ సెంటర్, రాగిరెడ్డి కళాక్షేత్రం పనుల ప్రగతిని సమీక్షించారు. స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, డీఈలు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

పటిష్టంగా లింగ నిర్ధారణ నిషేధ చట్టం

- ఆర్డీవో సత్యనారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై డివిజన్‌స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం శుక్రవారం ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన తన కార్యాలయంలో నిర్వహించారు. డివిజన్ పరిధిలో చట్టం అమలు తీరుతో పాటు స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలపై సమావేశంలో చర్చించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ చట్టం అమలుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్‌కి సంబంధించి ప్రతి రెండు నెలలకు ఒకసారి మొదటి శుక్రవారం మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం సక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో వెల్లడించారు. డివిజన్ స్థాయిలో 104 గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, అందులో 10 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో రెండు నెలల్లో 37 డెకాయ్ ఆపరేషన్లు, 133 ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. కొత్తగా నాలుగు స్కానింగ్ సెంటర్ల ఏర్పాటు నిమిత్తం జిల్లా కమిటీకి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ఈ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల స్థాయిలో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్లలో ఫిర్యాదుల కోసం 18004253365 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రదర్శించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీవో తెలిపారు. సమావేశంలో డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, జీజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ జి.హరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.కృష్ణారావు, ఎస్.గోవిందరావు, గైనకాలజిస్టు పి.సుజాత, ఎన్‌జీవో ప్రతినిధులు కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ఆంధ్రప్రదేశ్ ప్రగతి

- 'బాబు' మోసాలను ఎండగట్టండి
- ఇక నిరంతరం ప్రజల మధ్యే ఉండండి
- గృహ సారథులు, కన్వీనర్లకు ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి. సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు

కాకినాడ : వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడం ద్వారానే అన్నివర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉంటారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సీఎం జగన్‌తోనే ఆంధ్రప్రదేశ్ ప్రగతి సాధ్యమని స్పష్టం చేశారు. స్థానిక డి కన్వెన్షన్‌లో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ...' పేరుతో వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు పార్టీ ఇచ్చిన కార్యాచరణ ప్రకారం ఆయా కార్యక్రమాలను నిర్వహించాలని ద్వారంపూడి ఆదేశించారు. కన్వీనర్లు, గృహసారథులు మరింత క్రియాశీలకంగా పనిచేస్తూ నిరంతరం ప్రజల మధ్యే ఉండాలని సూచించారు. రానున్న ఆరు నెలలు అత్యంత కీలకమని, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రతీ నాయకుడు, కార్యకర్త దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా 2014లో చంద్రబాబు హామీలు ఇచ్చి దగా చేసిన వైనాన్ని, 2019లో సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిన విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో పార్టీ జెండాలను ఎగురవేసి సాధించిన ప్రగతిపై సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ కోసం కష్టించి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి సీఎంను చేసుకున్నాక ప్రతి కార్యకర్త ఆకాంక్షను నెరవేరుస్తారని హామీ ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సమష్టిగా పనిచేసి జగన్‌ను సీఎంగా, ద్వారంపూడిని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

తక్షణం అద్దెలు వసూలు చేయండి

- రూ.26 లక్షల బకాయిపై కలెక్టర్ ఆగ్రహం
- సత్వర చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆదేశం
- అరువు వ్యాపారాలపై విచారణ నివేదిక
- ఆర్ఎంఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం



కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో వ్యాపారాల పేరుతో తిష్టవేసి అద్దెలు ఎగ్గొడుతున్న వారిపై కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం సీరియస్ అయ్యారు. స్పందనలో అందిన వరస ఫిర్యాదుల మేరకు ఆమె విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో విస్తుపోయే వాస్తవాలు ఆమె దృష్టికి వచ్చాయి. కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక విచారణ బృందం ఆసుపత్రిలో రెండు రోజుల పాటు పర్యటించింది. జీజీహెచ్‌లో కొనసాగుతున్న దుకాణాల నిర్వాహణ, దుకాణదారులు అద్దెలు చెల్లిస్తున్న విధానం, తీసుకున్న అనుమతులు దేనికి, నడిపిస్తున్న వ్యాపారాలు ఏమిటి, అనధికార ఆక్రమణలకు పాల్పడి దుకాణాలు విస్తరించడం, కొబ్బరికాయలు, వాటర్ బాటిళ్ళు సహా ఇతర వస్తువులు తినుబండారాలు అధిక ధరలకు విక్రయించడం, ఇంత ఎక్కువ ధర ఏమిటి అని రోగుల బంధువులు ప్రశ్నిస్తే వారితో ఘర్షణ పడడం, చొల్లంగి వేణుగోపాల్ అనే వ్యాపారి దుకాణం రేకులతో నిర్మించడం, ఈ నిర్లక్ష్యం కారణంగానే కొద్ది రోజుల క్రితం అదే దుకాణంలో విద్యుతాఘాతం చోటుచేసుకోవడం వంటి కీలక అంశాలతో ఆ బృందం నివేదికను సిద్ధం చేసి శుక్రవారం కలెక్టర్‌కు సమర్పించింది. ఆయా అంశాలను పరిశీలించి నిర్ఘాంతపోయిన కలెక్టర్ తక్షణమే జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని పిలిపించి నివేదికలోని అంశాలపై ఆరా తీశారు. ఆ వివరాలన్నీ నిజమేనని డాక్టర్ కుమారి నిర్ధారించారు. ఆసుపత్రిలోని వ్యాపారులు విద్యుత్ బిల్లులు, అద్దెలు చెల్లించకపోవడంతో హెచ్‌డీఎస్ నిధులు మొత్తం అడుగంటాయని, ఆస్పత్రి అభివృద్ధికి వ్యాపారులు నిర్వాకం తీవ్ర ఆటంకంగా మారిందని వివరించారు. కేవలం అద్దెలే సుమారు 26 లక్షలు బకాయిలు ఉన్నాయని, ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనితో కలెక్టర్ వ్యాపారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అద్దెలు, విద్యుత్ బిల్లులు చెల్లించని, అలాగే టెలిఫోన్ బూత్ నిర్వహిస్తామని తక్కువ మొత్తానికే అనుమతులు పొంది సూపర్ మార్కెట్ వంటి దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో వ్యాపారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని ఖాళీ చేయించనున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ కోసం శుక్రవారం సాయంత్రం ఆర్ఎంఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నియమించామని ఆమె తెలిపారు.

పోర్టు పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



పోలీసు స్టేషన్‌లో కేసుల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: సాధారణ తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ శుక్రవారం కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. కేసుల నమోదు, పరిష్కార సరళిని ఇన్‌స్పెక్టర్ సుమంత్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన పలువురు ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ సిబ్బంది నుంచి అందుతున్న గౌరవ మర్యాదలు, సేవల ప్రయోజనాలు సంతృప్తికరంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి బాగోగులపై ముచ్చటించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని స్టేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు.

సంక్షేమ పథకాలు ఇచ్చాం.. ఆశీర్వదించండి..

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 49వ డివిజన్‌లో గడప గడపకూ..



49వ డివిజన్‌లో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పథకాలు అందించామని వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విజ్ఞప్తి చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా 49వ డివిజన్ సచివాలయం-బి పరిధిలో శుక్రవారం పర్యటించారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్, విద్యుత్‌నగర్, మధురానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అందించిన సీఎం జగన్‌ను దీవించాలని కోరారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కడియాల చినబాబు, సీనియర్ నాయకుడు పాలిక రమణ, పార్టీ నాయకులు కృష్ణంరాజు, నాని, కొండలరావు, వైఎస్ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మిస్టరీగానే బాలుడి మృతి కేసు

పెద్దాపురం: స్థానిక లూథరన్ హైస్కూల్ ఎదురుగా బాలాజీ అపార్ట్‌మెంట్‌లో పదేళ్ల బాలుడు చార్లెస్‌రే అనుమానాస్పద మృతి మిస్టరీగానే కొనసాగుతోంది. బాలుడు నివసిస్తున్న అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న కోళ్ల వ్యాపారి, అతని డ్రైవర్ కారు పార్క్ చేస్తుండగా అక్కడే ఉన్న చార్లెస్‌ను గమనించకుండా అతడిపై నుంచి కారును ఎక్కించినట్లు స్థానికుల సమాచారం. అదే రోజు వ్యాపారి, స్థానిక పాత పెద్దాపురం బొమ్మలగుడికి చెందిన డ్రైవర్‌ను కాపాడేందుకు ఓ సోషల్ మీడియా, తన అనుచరగణం కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక ప్రకారం యాక్సిడెంట్ వల్లే బాలుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు వారు తెలిపారు.